
RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 174 | జూన్ 5, 2025 | వెల : రూ.3-00



చరిత్రను మళ్లీ నిర్మించారు..

3లో..



## వన్ మంత్ డెడ్‌లైన్

- సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి..
- కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హొదా తీసుకురండి
- గోదావరి జలాలను పరిరక్షించుకోవడానికి తెలంగాణ జాగృతి నడుం బిగించింది: : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

**వేద న్యూస్, హైదరాబాద్:**



కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హొదా సాధించేందుకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డికి నెల రోజుల సమయం ఇస్తున్నానని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డెడ్ లైన్ విధించారు. జాతీయ హొదాకు సంబంధించి అపెక్స్ కమిటీకి వారిద్దరూ లేఖ రాయాలని కోరారు. రాజకీయ దురుద్దేశంతోనే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని.. కేసీఆర్ ఏం తప్పు చేశారని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసుసు ఇవ్వడాన్ని నిరసిస్తూ బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఎమ్మెల్సీ కవిత, జాగృతి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడు తూ కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే మొత్తం తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్లేనని మండిపడ్డారు. తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వడం కేసీఆర్ చేసిన తప్పానని ప్రశ్నించారు. కాళేశ్వరం పూర్తయితే 35 శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు అందిస్తోందని కవిత చెప్పారు. కేసీఆర్‌ది గట్టి గుండె, అందువల్లే అంత పెద్ద ప్రాజెక్టు నిర్మించారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్ ను బద్నాం చేసేందుకే కాళేశ్వరం కమిషన్ వేశారని అన్నారు. కాళేశ్వరం కమిషన్ కాదు అది కాంగ్రెస్ కమిషన్, రాజకీయ కమిషన్ అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డకు చిన్నచిన్న మరమ్మతులు చేయట్లేదన్నారు. తెలంగాణ నీళ్లను ఏపీ తరలించుకుపోతుంటే రేవంత్ రెడ్డి స్పందించట్లేదని ఆరోపించారు.

గోదావరి–పెన్నా అనుసంధానం పేరిట నీళ్ల తరలింపును అడ్డుకోవాలని కవిత సూచించారు. బీజేపీలో ఉన్న తెలంగాణ బిడ్డ ఈటల కూడా మాట్లాడకోవడం విడ్డూరంగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. గోదావరి–బనకచర్లను ఆపే బాధ్యతను ఈటల రాజేందర్ తీసుకోవాలన్నారు. కాళేశ్వరానికి జాతీయహొదా తీసుకొచ్చే బాధ్యతను కూడా ఈటల తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. గోదావరి జలాలను పరిరక్షించుకోవడానికి తెలంగాణ జాగృతి నడుం బిగించిందని తెలిపారు.







# సామాన్యుల ప్రాణాలంటే పట్టింపులేదా?

- దేవునూరు ఎడ్లబండ వద్ద బ్లాస్టింగ్
- జనావాసాలకు సమీపంలో ఉన్నా పట్టించుకోరా?
- ఓ వ్యక్తికి మెడపైన గాయం, చిన్నారికి కనుబొమ్మలపైన తీవ్రగాయం
- పేలుళ్లు జరిపిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల విజ్ఞప్తి

**వేద న్యూస్, వరంగల్:**

జనావాసాలకు సమీపంలో ఉన్న గుట్టల్లో(ఎడ్లబండ) రాళ్లను బాంబులతో పేల్చడంతో ప్రజలు బెంబేలెత్తారు. బాంబు పేలుళ్ల ధాటికి (సౌండ్‌కు).. తమ ప్రాణాలు అరచేతిలోకి వచ్చాయని భయాందోళన వ్యక్తం చేశారు. వివరాల్లోకెళితే.. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూరు గ్రామంలో.. (ఎడ్లబండ) గుట్టల వద్ద బుధవారం సాయంత్రం సుమారు 4 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా బాంబులు పేలాయి. దాంతో గ్రామ జనం అతలాకుతలమయ్యారు. ఆ గుట్టకు సమీపంలో సుమారు 20కి పైగా కుటుంబాలు ఉన్నాయి. ఆ ఫ్యామిలీస్ మొత్తం



భయపడిపోయాయి. బాంబుల ధాటికి సమీపంలోని కోళ్లఫారం రేకుల పైకప్పు విరిగి పోయింది. ఓ వ్యక్తి మెడపైన తీవ్ర మైన గాయం కాగా, ఓ చిన్నారికి కన్నుమీద గాయమై పెనుప్రమాదం తప్పింది. కోళ్లఫారంలోని గుడ్లన్నీ పగిలిపోయాయి. కాగా, ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా.. బాంబు పేలుళ్లు నిర్వహిస్తే.. ప్రమాదవశాత్తు ఎవరికైనా ఏమైనా జరిగితే ఎవరు బాధ్యులు? అని ప్రత్యక్ష సాక్షులు ప్రశ్నించారు. ప్రజల(సామాన్యులు) ప్రాణాలంటే పట్టింపు లేదా? అని ఆగ్రహం వ్యక్తం చేశా రు. సంబంధిత శాఖ వారు సదరు క్రషర్ యాజ మాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొంత మంది వ్యక్తులు గుట్టల(ఎడ్లబండ) వద్ద బాంబులు పెట్టి రాళ్లను విడగొడుతున్నట్టు తెలుస్తోంది. ఆ రాళ్లను వేరే చోటుకు క్రషర్ వద్దకు తీసుకెళ్లి మళ్లీ క్రషింగ్ చేస్తు న్నట్టు సమాచారం.

**నాకు ప్రమాదం తృటిలో తప్పింది:**

**- సంగెకారి యువరాజు, దేవునూరు గ్రామస్తుడు**

గుట్టల వద్ద బాంబు పేలుడు నుంచి నాకు ప్రమాదం తృటిలో తప్పింది. నిజానికి నేను ఆ సమయానికి బాంబు పేలుడు జరిగిన ప్రాంతానికి వెళ్లాల్సి ఉండగా, వేరే పని నిమిత్తం వెళ్లలేదు. అలా నాకు ప్రమాదం తప్పింది. జనావాసాలకు సమీపంలో పేలుళ్లు జరపడం సరికాదు.

### విచ్చలవిడిగా మందు సామగ్రి వాడుతున్నారు

**- సందీప్, దేవునూరు గ్రామస్తుడు**

రైతులు పంటపొలాలకు కోడి ఎరువు తరలించే సమయంలో బాంబు పేలుళ్లు జరుపుతున్నారు. ఎడ్లబండ వద్ద కొందరు వ్యక్తులు విచ్చలవిడిగా మందు సామగ్రి వాడుతూ బాంబు బ్లాస్టింగ్ చేస్తున్నారు. బుధవారం ఎడ్లబండ వద్ద మందుసామగ్రి వాడి బాంబు పేలుళ్లు కొందరు జరిపారు. పక్కనే కోళ్లఫారం ఉన్నా పట్టించుకోకుండా బాంబు పేలుళ్లు జరిపారు. దాంతో కోళ్లఫారం రేకులు పగిలిపోవడంతో పాటు కొందరికి గాయాలయ్యాయి. ఓ వ్యక్తికి మెడపైన, మరో చిన్నారికి కనుబొమ్మలపైన తీవ్రమైన గాయమయింది. కొద్దిలో పెనుప్రమాదం తప్పింది. అధికారులు సదరు వ్యక్తుల(క్రషర్ కు సంబంధించిన యాజమాన్యం)పై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.




## సమాజానికి దిక్సూచి జర్నలిజమే..!

- కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ తిరునహరి శేషు
- విజయవంతమైన జర్నలిస్టుల శిక్షణా శిబిరం
- వృత్తి నైపుణ్యంపై క్లాస్ బోధించిన కేయూ జర్నలిజం విభాగం అధ్యాపకులు కంజర్ల

**వేద న్యూస్, కాశీబుగ్గ :**

సమాజానికి దిక్సూచి జర్నలిజమేనని జర్నలిజం వృత్తి ఏంతో బాధ్యతాయుత మైనదని కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్, రాజకీయ విశ్లేషకులు తిరునహరి శేషు అన్నారు. సీనియర్ జర్నలిస్టులు జక్కుల విజయ్ కుమార్, జన నిర్ణయం ఎడిటర్

మిగతా 4వ పేజీలో..

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్, ఖిలా వరంగల్ :**



భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. బుధవారం వరంగల్ మండలం ఏనుమాముల, ఖిలా వరంగల్ మండలం అల్లిపూర్ గ్రామాలలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటికే వర్ధన్నపేట మండలంలో పైలెట్ ప్రాతిపదికన రెవెన్యూ సదస్సులు జరిపి, క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేశామని అన్నారు. ప్రస్తుతం జిల్లాలోని 12 మండలాలోని రెవెన్యూ గ్రామాలలో ఈ నెల 20వ తేదీ వరకు సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ల నేతృత్వంలో రెండు బృందాలను నెలకొల్పి, ప్రతి రోజు ప్రతి మండలంలో రెండు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరిపేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్స్ లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్–బిలో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి భూభారతి కొత్త చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ ఆయా గ్రామాలలో అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్ణీత ప్రొఫార్మాలో ప్రింట్ చేసిన దరఖాస్తులను అందజేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ

మిగతా 4వ పేజీలో..



## 'ఖర్గే'వి పీడ కలలు


- రాహుల్‌గాంధీ పీఎం కాలేరు
- బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం
- మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్


**వేద న్యూస్, వరంగల్ జిల్లా:**

11 ఏళ్ల మోదీ పాలనలో సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలదే అని మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ అన్నారు. బుధవారం బిజెపి వరంగల్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆద్వర్యంలో కార్యక్రమ కన్వీనర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్ అధ్యక్షతన జిల్లా, మండల స్థాయి పదాధికారులతో 11 సంవత్సరాల మోదీ ప్రభుత్వం – సంకల్పంతో సాకారం జిల్లా కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ హాజరయ్యారు. మొదటగా జిల్లా కార్యాలయ ఆవరణలో మొక్కను నాటి పర్యావరణాన్ని పరిరక్షించేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని అన్నారు.

11 ఏళ్ల మోదీ పాలనతో సాధించిన విజయాలు, ఘనతలపై ఈ నెల

మిగతా 4వ పేజీలో..





# స్మార్ట్ సిటీ బస్టాండ్ @

# దుర్గంధం!

- అపరిశుభ్రతకు కేరాఫ్‌గా హన్మకొండ బస్టాండ్ మరుగుదొడ్లు
- టాయ్‌లెట్స్ నుంచి భరించలేనంత దుర్వాసన
- సౌకర్యాల కొరతపై ప్రయాణికుల అసంతృప్తి

**వేద న్యూస్, ఫోకస్ టీమ్:**

హన్మకొండ బస్టాండ్‌లో మరుగు దొడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా ఉన్నది. 'స్మార్ట్' సిటీగా గ్రేటర్ వరంగల్ నగరానికి పేరు ఉన్నా.. అవే పాత సమస్యలు అక్కడ కనిపిస్తున్నాయి. కరీంనగర్, వేములవాడకు వెళ్లే బస్సులు నిలిచే ప్లాట్‌ఫాం వద్ద ఉన్న మూత్రశాలలు కంపు కొడుతున్నాయి. వరంగల్ మహానగరానికి కాస్తో, కూస్తో చెప్పుకోదగ్గ ఈ హన్మకొండ బస్టాండ్‌లో ఇలాంటి పరిస్థితులు ఉండటంతో ఇక్కడికి వచ్చే ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక్కడి పరిస్థితులు, సౌకర్యాల కొరతపై ప్రయాణికులు, నగర ప్రజలు పెదవి విరుస్తున్నారు.






### పైపుల నుంచి వృథాగా పోతున్న నీరు

ఇక్కడి మూత్రశాలల్లో పైపుల నుంచి నీరు వృథాగా పోతున్న తీరు ఆందోళన కలిగించక మానదు. వాష్‌రూం, వాష్‌బేసిన్లకు అటాచ్ అయి ఉన్న పైపుల నుంచి నీరు నిరంతరాయంగా బయటకు వెళ్తున్నది. సదరు పైపుల నుంచి వచ్చే నీటిని నియంత్రించేందుకు వాల్లు(వాల్స్) లేకపోవటం, పైపులు విరిగిపోవటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. వేసవి కాలంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని చెప్పే ప్రజాప్రతినిధులు, అధికారులు..ఇలా వృథాగా పోతున్న నీటి విషయంలో ఏం సమాధానం చెప్తారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

### అపరిశుభ్రత..దుర్గంధం.. పట్టించుకునే వారేరి?

ప్రజలు తమ గమ్య స్థానాలకు చేరడం కోసం వరంగల్, హన్మకొండ, కాజీపేట నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా ఈ బస్టాండ్‌కు రోజుకు వందలాది మంది వస్తారు. కాబట్టి.. ప్రయాణికులకు అనుకూలమైన, పరిశుభ్రమైన టాయ్‌లెట్ సౌకర్యాలు కల్పించటం ఆర్టీసీ అధికారుల విధి. కానీ, ఇక్కడ అలాంటి పరిస్థితులేవీ కనబడటం లేవు. మరుగుదొడ్లు తీవ్ర అపరిశుభ్రంగా ఉన్నాయి. దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. గోడలకు పాన్ పరాక్, పాకురు మరకలు కనిపిస్తున్నాయి. టాయ్‌లెట్ బేసిన్లలో వ్యర్థాలు నిలిచిపోతున్నాయి. లావెటరీ (మరుగుదొడ్డి)లో కనీసం జగ్గు(లోట)లు కూడా లేవని ప్రయాణికులు వాపోతున్నారు. 'తాము ఇక్కడి వాష్ రూంలను ఉపయోగించాలంటేనే వణికిపోతున్నామని జనం అంటున్నారు. అత్యవసర, తప్పని పరిస్థితుల్లో ఇక్కడి టాయ్‌లెట్లను వినియోగిస్తున్నామని వాపోతున్నారు. ఈ మరుగుదొడ్లను తాము అనారోగ్యం బారిన డెఫినెట్‌గా పడుతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్‌లో ఉన్న అన్ని మూత్రశాలలనూ పరిశుభ్రంగా ఉంచాలని, అందులో వసతులు, సౌకర్యాలను మెరుగుపరచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### నగర పౌరుడి ట్వీట్.. స్పందించిన టీజీఎస్‌ఆర్టీసీ

ఈ సమస్యలపై ఆందోళన వ్యక్తం చేస్తూ వరంగల్ నగరానికి చెందిన స్థానికుడు ఎస్.గోవర్ధన్ ఎక్స్(ట్విట్టర్ ) వేదికగా పోస్ట్ పెట్టాడు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ), రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖలను ట్యాగ్ చేస్తూ సమస్యను పరిష్కరించాలని తన ట్వీట్‌లో కోరాడు. దీనికి టీజీఎస్‌ఆర్టీసీ ఎక్స్ ఖాతా నుంచి స్పందన వచ్చింది. 'ఈ సమస్యపై దృష్టి సారించండి' అని బస్టాండ్ డిపో మేనేజర్ ఎక్స్ ఖాతాను ట్యాగ్ చేస్తూ సంస్థ రిప్లయి ఇచ్చింది. ఈ మేరకు స్పందించిన వరంగల్%-%1 డిపో మేనేజర్ ట్విట్టర్ హ్యాండిల్.. 'సమస్య త్వరలో పరిష్కారమవుతుంది' అని పేర్కొన్నది.

# కాంగ్రెస్ కమిటీల్లో మహిళలు ఎక్కడ?

హైదరాబాద్ : కాంగ్రెస్ అధిష్ఠానం ఇటీవలే ప్రకటించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి సంబంధించిన ఐదు కమిటీలపై పలువురు సీనియర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇక మహిళలకు పార్టీ పదవుల విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడుతున్నారు. ఢిల్లీలో సోనియాగాంధీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా మీనాక్షినటరాజన్ ఉన్నప్పటికీ.. ఏఐసీసీ ప్రకటించిన ఐదు కమిటీల్లో మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించకుండా మొండిచెయ్యి చూపారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మహిళలకు చట్టసభల్లో 33శాతం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజ ర్వేషన్ కల్పించేందుకు పార్లమెంట్ ఉభయసభల్లో మహిళా బిల్లును తక్షణమే అమల్లోకి తీసుకురావాలని రాహుల్ గాంధీ డిమాండ్‌చేస్తున్నారు. కానీ తమ పార్టీ పదవుల విషయం లో మాత్రం మహిళలకు 33 శాతం ఎందుకు అమలుచేయడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. గత శుక్రవారం ప్రకటించిన ఐదు కమిటీల్లో మొత్తం 66మంది ఉండగా, మహిళలకు ఆరుగురికి మాత్రమే చోటివ్వడంపై విస్మయం వ్యక్తమవుతోంది. 'మహిళల ఓట్లు కావాలి.. మహి ళలు పార్టీ కోసం పనిచేయాలి.. పదవుల పంపకం వచ్చేసరికి చిన్నచూపా' అని నారీమణులు మండిపడుతున్నారు. ఒకవైపు మహిళలకు కమిటీల్లో సరైన ప్రాతినిధ్యం కల్పించలేదని ఆవేదనతో ఉండగానే మరోవైపు రాజకీయ వ్యవహారాల కమిటీలో సీనియర్ నాయకులను పక్కనపెట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా ఒకరిద్దరు నాయకులకు రెండు కమిటీల్లో అవకాశం కల్పించడం.. కొందరు సీనియర్ నాయకులు, కొందరు మంత్రులను పక్కనపెట్టడం ఏంటనీ..? ప్రశ్నిస్తు న్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీలో అత్యంత ప్రాధాన్యంగా భావించే రాజకీయ వ్యవహారాల కమిటీని 22మందితో ప్రకటించగా, మహిళల నుంచి మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరిలకు మాత్రమే అవకాశం కల్పించారు. మిగతా 20మందిలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షినటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూ టీ సీఎం భట్టివిక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు దామోదర రాజనరసింహ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, నాయకులు షబ్బీర్‌అలీ, అజారుద్దీన్, ప్రభు త్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, శ్రీహరి ముదిరాజ్, ప్రేమ్‌సాగర్‌రావుతో పాటు జెట్టి కుసుమకుమార్, ఈరవత్రి అనిల్ ఉన్నారు. అయి తే ఈ రాజకీయ వ్యవహారాల కమిటీలో మిగతా మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావుకు చోటు ఇవ్వక పోవడంపై అసంతృప్తితో ఉన్నారు. ఇక ఇప్పటి వరకు పీఏసీలో పీసీసీ మాజీ అధ్యక్షులు, మాజీ సీఎల్పీ నేతలకు కూడా చోటు ఉండే ది, కానీ ఇటీవల ప్రకటించిన కమిటీలో పీసీసీ మాజీ అధ్యక్షుడు వీ హనుమంతరావు, జానారెడ్డిని విస్మరించడపై సొంత పార్టీ నేతలే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇక పీసీసీ సలహాదారు (అడ్వయిజరీ)కమిటీని 15మందితో ప్రకటించినప్పటికీ.. మహిళల నుంచి మాజీమంత్రి గీతారెడ్డికి మాత్రమే అవకాశం కల్పించారు. ఈ కమిటీలోనూ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షినటరాజన్, సీఎం సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పీసీసీ మాజీ అధ్యక్షుడు వీ హనుమంతరావు, జానారెడ్డి, కేశవరావు, మధుయాష్కీ గౌడ్, చిన్నారెడ్డి, అంజన్‌కుమార్‌యాదవ్, జగ్గారెడ్డి, జాఫర్ జావెద్, మాజీమంత్రి జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ ఉన్నారు. అయితే ఈ కమిటీలో మహిళల నుంచి గీతారెడ్డికి చోటు ఇవ్వగా, ఆమె కొంత కాలంగా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. అయినప్పటికీ గీతారెడ్డితోపాటు మ రొకరికి అవకాశం కల్పిస్తే బాగుండేదనే అభిప్రాయం కాంగ్రెస్ మహిళా నేతల నుంచి వ్యక్తమవుతోంది. రాజ్యాంగ పరిరక్షణ కమి టీ (సంవిధాన్ బచావో)ను 16మందితో ప్రకటించగా, అదిలాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసిన ఓటమి చెందిన అత్రం సుగుణ, జూలూరి ధనలక్ష్మికి మాత్రమే అవకాశం ఇచ్చారు. రాజ్యాంగ పరిరక్షణ కమిటీలో పీ వినయ్‌కుమార్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే శంకరయ్య, బాలునాయక్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, పార్టీ నాయకులు రాచమల్ల సిద్దేశ్వర్, కే సంతోష్, పులి అనిల్‌కుమార్, మాజిద్‌ఖాన్, జీ రాము లు, అర్జున్‌రావు, శౌరీ, కే వల్లభరెడ్డి, వీ శ్రీ కాంత్‌రెడ్డి ఉన్న విషయం తెలిసిందే. డీలిమిటేషన్ కమిటీని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి నేతృత్వంలో ఏడుగురితో కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించిన కమిటీలో హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మిని మాత్రమే నియమించారు. ఈ కమిటీ లో వంశీచంద్‌రెడ్డి, గద్వాల విజయలక్ష్మితో పాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మె ల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, పవన్ మల్లాడి, డీ వెంకటరమణ ఉన్నారు. ఇదిలాఉండగా పార్టీలో అత్యంత కీలకమైన పీసీసీ క్రమశిక్షణ కమిటీలో మహిళలను పూర్తిగా విస్మరించారు. పార్టీ సీనియర్ నేత, ఎంపీ మల్లు రవి చైర్మన్‌గా, పార్టీ సీనియర్ నేత శ్యామ్ మోహన్ వైస్‌చైర్మన్‌గా ఉండగా, నిరంజన్‌రెడ్డి, కుమార్‌రావు, జాఫర్ జావెద్, జీవీ రామ కృష్ణ సభ్యులుగా ఉన్నారు. ఆరుగురితో నియమించిన ఈ కమిటీకి అర్హులైన మహిళలు పార్టీలో దొరకడం లేదా..? అనే ప్రశ్నలు సొంత పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. ఇటీవలనే పీసీసీ మహిళా విభాగం అధ్య క్షురాలు సునీతారావు కూడా పార్టీకోసం కష్టపడిన మహిళలకు పదవు ల్లో అవకాశం కల్పించాలని గాంధీభవన్‌లోనే ఆందోళన చేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ పదవుల్లో పార్టీ కోసం కష్టపడిన వారికి సరైన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ వినిపిస్తోంది.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి




- కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే

**వేద న్యూస్, హన్మకొండ :**

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అభిప్రాయపడ్డారు. వంద రోజుల ప్రణాళిక అమలులో భాగంగా బుధవారం 6,9 వ డివిజన్ లోని కిషన్ పుర కాకతీయ కాలనీ ప్రాంతాల్లో కార్పొరేటర్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయి లో సందర్శించి నిర్వహించిన స్వచ్ఛ ర్యాలీ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య అవగాహన లో భాగం గా వర్షాకాలం నేపథ్యం లో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తడి పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ స్వచ్ఛ ఆటోలకు అందించడం దిన చర్యగా అలవాటు చేసుకోవాలని అన్నారు. వ్యాపారాలు నిర్వహించే దుకాణ దారులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని ప్రతి రోజు నగర వ్యాప్తం లగా పరిశుభ్రమైన నీటిని అందజేయడానికి నీటి సరఫరా సిబ్బంది క్లోరిన్ పరీక్ష లు నిర్వహించి నీటిలో పిపిఎం స్థాయి లను నిర్ధారించిన తరువాతే నీటి సరఫరా చేస్తారని అన్నారు. జీడబ్ల్యూఎంసి పరిధిలోని ప్రాంతాలను నివాస యోగ్యమైన స్థిరమైన కార్యాచరణకు అనుకూలమైన నగరంగా తీర్చిదిద్దేందుకు వంద రోజుల కార్యచరణ ప్రణాళిక కొనసాగుతుందని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడానికి స్థానిక ప్రజలను భాగస్వాములను చేసి స్వచ్ఛ ప్రతిజ్ఞలను నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య సిబ్బంది గోడ ప్రతులు కరపత్రాల ద్వారా శానిటేషన్ తీరు పై అవగాహన కలిగించి ఇందుకు సంబంధించిన స్టికర్ లను గృహాలకు అతికించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చీకటి శారద, సిఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, బల్దియా వెటర్నరీ వైద్యులు డా. గోపాల్ రావు, ఎం.హెచ్.ఓ డా. రాజేష్, ఏఈ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తలనొప్పిగా మారిన మేఘా వేమూరి

## పాలస్తీనాకు మద్దతు పలికిన తెలుగు అమ్మాయి

హైదరాబాద్ : అమెరికా భారతీయ విద్యార్థులకు ఉన్నత విద్యకు ఒక ప్రధాన గమ్యస్థానంగా ఉంది. అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలు, అధునాతన పరిశోధన సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు లక్షలాది భారతీయ విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. 2024లో, 3 లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు అమెరికాలో విద్యనభ్యసిస్తున్నారని అంచనా. అయితే, ఇటీవలి సంవత్సరాలలో, వీసా నిబంధనలు, రాజకీయ వాతావరణం, మరియు క్యాంపస్ వివాదాలు ఈ ప్రయాణాన్ని సంక్లిష్టం చేస్తున్నాయి. అమెరికాలో చదువుకోవాలనే ఆకాంక్ష ఉన్న భారతీయ విద్యార్థులకు వీసా పొందడం అతిపెద్ద సవాలుగా మారింది. ట్రంప్ పరిపాలనలో అమలైన కఠిన ఇమ్మిగ్రేషన్ విధానాలు ఊ?1 విద్యార్థి వీసాల ప్రక్రియను కఠినతరం చేశాయి. మరోవైపు చిన్న నిబంధన ఉల్లంఘనలు, ఉదాహరణకు, ట్రాఫిక్ జరిమానాలు లేదా తరగతులకు హాజరు కాకపోవడం వంటి కారణాలతో వీసాలు రద్దు చేయబడుతున్నాయి. 2023లో, దాదాపు 7 వేల మంది భారతీయ విద్యార్థులు వీసా గడువు ముగిసిన తర్వాత కూడా అమెరికాలో ఉండిపోయారని నివేదికలు



తెలిపాయి. చదువు పూర్తయిన తర్వాత ఉపాధి కోసం ఏ-1ఆ వీసా పొందడం కూడా కష్టతరమైంది, ఇది భారతీయ విద్యార్థులకు ఆర్థిక ఒత్తిడిని పెంచుతోంది. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ పథకం భారతీయ విద్యార్థులకు చదువు తర్వాత అమెరికాలో పని అనుభవం పొందే అవకాశాన్ని అందిస్తుంది. అయితే, ఈ పథకాన్ని రద్దు చేయాలనే ప్రతిపాదనలు విద్యార్థులలో ఆందోళన కలిగిస్తున్నాయి. కఖీ రద్దు అయితే, విద్యార్థులు చదువు పూర్తయిన వెంటనే దేశం విడిచి వెళ్లవలసి ఉంటుంది, ఇది వారి కెరీర్ ఆకాంక్షలను దెబ్బతీస్తుంది. ఈ విధానం ముఖ్యంగా ఖీఉఓ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) విద్యార్థులను ప్రభావితం చేస్తుంది, ఎందుకంటే భారతీయ విద్యార్థులలో ఎక్కువ మంది ఈ రంగాల్లో చదువుతున్నారు. అమెరికా విశ్వవిద్యాలయాలలో రాజకీయ ఆందోళనలు, వివాదాలు భారతీయ విద్యార్థులను కూడా ప్రభావితం చేస్తున్నాయి. ఉదాహరణకు, పాలస్తీనా-ఇజ్రాయెల్ సంఘర్షణ సంబంధిత ఆందోళనలలో పాల్గొన్న విద్యార్థులు క్రమశిక్షణా చర్యలను ఎదుర్కొంటున్నారు. ఇటీవలి కొన్ని సంఘటనలలో, ఆందోళనలలో పాల్గొన్న విదేశీ విద్యార్థుల వీసాలపై చర్యలు తీసుకోవడం లేదా విశ్వవిద్యాలయ అడ్మిషన్లపై ఆంక్షలు విధించడం జరిగింది. ఈ విధమైన సంఘటనలు విద్యార్థులను క్యాంపస్ కార్యకలాపాలలో పాల్గొనడానికి భయపడేలా చేస్తున్నాయి, ఇది వారి విద్యా అనుభవాన్ని పరిమితం చేస్తుంది. అమెరికాలో చదువు ఖర్చు ఎక్కువగా ఉండటంతో, భారతీయ విద్యార్థులు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఒక సంవత్సరం ట్యూషన్ ఫీజు, జీవన ఖర్చులు సగటున 50 వేల డాలర్ల నుంచి 70 వేల డాలర్ల వరకు ఉంటుంది. ఇది చాలా మంది భారతీయ కుటుంబాలకు భారమైనది. తాజాగా ఎంఐటీ యూనివర్సిటీలో చదువుతున్న తెలుగు మూలాలు ఉన్న అమ్మాయి మెఘా వేమూరి గ్రాడ్యుయేషన్ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు భారతీయ విద్యార్థుల అమెరికా చదువులను మరింత జఠిలం చేసే అవకాశం కనిపిస్తోంది. అమెరికా పౌరసత్వం ఉన్న మెఠా మేమూరి గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా పాలస్తీనాకు మద్దతుగా మాట్లాడారు. ఇజ్రాయెల్ పాలస్తీనాను కనుమరుగు చేయాలని చూస్తోందని విమర్శించారు. ఎంఐటీ యూడా ఈ హింసలో భాగస్వామి అని పేర్కొన్నారు. అయితే విద్యార్థులకు మాత్రం వర్సిటీ మద్దతు ఇస్తుందని తెలిపారు. అయితే ఈ వ్యాఖ్యలు ఇప్పుడు అమెరికాలో చదువులోకవాలనుకుంటున్న, చదువుకుంటున్న, అమెరికా వెళ్లాలనుకుంటున్నవారి అవకాశాలకు ఆటంకంగా మారాయి.


మెఘా వేమూరి మాట్లాడడానికి ఎన్నో అంశాలు ఉన్నాయి. ఇక్కడ మరో విషయం ఏమిటంటే అమె అండర్ గ్రాడ్యుయేట్. అంటే టీనేజీ అమ్మాయే. అయినా అంత మెచ్యూరిటీగా ఆలోచించడం అభినందనించాల్సిన అంశం. చాలా మంది మెఘాను అభినందిస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రశంసలు కురుస్తున్నాయి. అయితే ఎంఐటీ యాజమాన్యం మాత్రం ఆమె గ్రాడ్యుయేషన్ సెర్మనీకి రాకుండా నిషేధించింది. ఇక మెఘా వేమూరికి మాట్లాడడానికి ఉక్రెయిన్ - రష్యా, పహల్గాంతోపాటు అనేక అంశాలు ఉన్నాయి. కానీ ఆమె తనకు గుర్తింపు తెచ్చే అంశాన్ని మాత్రమే ఎంచుకుంది. సాధారణంగా గ్రాడ్యుయేషన్ సెర్మనీలో అందరూ ప్రశంసనీయమైన ప్రసంగం చేస్తారు. మెఘా మాత్రం వివాదాస్పద అంశం ఎంచుకుని తాను గుర్తింపు తెచ్చుకుంది. కానీ, భారతీయుల అమెరికా చదువుల కలకు ఆటంకాలు సృష్టించింది.

# మార్గదర్శకాలు విడుదల చేయడం హర్షణీయం

**వేద న్యూస్, హైదరాబాద్ :**



రాష్ట్రంలోని చేనేత కార్మికులకు నేతన్న భరోసా పథకం అమలుకు మార్గదర్శకాలను ఆలస్యంగా నైనా విడుదల చేయడం హర్షణీయమని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. చేనేత కార్మికుడికి రూ.18000 అనుబంధం కార్మికుడికి రూ.6000 రెండు విడతలుగా ఇస్తామని ప్రకటించడం జరిగిందన్నారు .ఈ పథకాన్ని అమలు జరపాలని చేనేత కార్మిక సంఘాలు అనేక విధాలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకు పోవడం జరిగిందన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలో జియో ట్యాగ్ వేయని చేనేత మగ్గాలు ఉన్నాయని వాటికి కూడా జియో ట్యాగ్ వేసి వారందరికీ చేనేత భరోసా పథకం అమలు జరపాలని ఆయన అన్నారు. ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసినత మాత్రాన సరిపోదని ఏమాత్రం కాలయాపన చేయకుండా తక్షణమే అమలు జరపాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నట్లుగా నేతన్నల మరియు సహకార సంఘాల అన్ని రకాల రుణాలుమాఫీ చేయాలని, జాప్యం చేయకుండా చేనేత ప్రాథమిక సహకార సంఘాలకు మరియు టెస్కోకు ఎన్నికలు జరపాలన్నారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు.




# చరిత్రను మళ్లీ.. నిర్మించారు!











- కాకతీయుల కాలంలో వైభవంగా పూజాధి కైంకర్యాలు
- యుద్ధాల కారణంగా ధ్వంసమైన విగ్రహాలు..
- గ్రామస్థులంతా ఏకమై ఆలయాల పునర్నిర్మాణం..
- శుక్రవారం నుంచి మూడు రోజులు ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు
- బొడ్డు చింతలపల్లిలో దేవుళ్ల పండుగ..
- ఊరంతా సందడే సందడి...




**వేద న్యూస్, డెస్క్**

కాకతీయుల కాలంలో నిత్యం పూజాధి కైంకర్యాలు జరిగిన దేవాలయం అది.. రాజ్యాలు, రాజులు మారే తరుణంలో జరిగిన యుద్ధాల ఫలితంగా ధ్వంసమైన ఆ ఆలయం యొక్క చరిత్రను తెలుసుకున్నారు ఆ గ్రామస్థులు.. అందరూ ఏకమై ఆ ఆలయాన్ని పునర్ని ర్మించే బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. కాకతీయుల నిర్మాణ శైలి, ఆగమశాస్త్ర నియ మాలు, స్థలపురాణ పద్దతులు అనుసరించి శివరామ క్షేత్రాన్ని నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు.. ఆ ఆలయమే వరంగల్ జిల్లా గీసుగొండ మండలం బొడ్డు చింతలపల్లిలో నిర్మించి ప్రారంభోత్సవ హం గులతో విరాజిల్లుతుంది. రాచరిక కాలంలో యుద్ధాల ప్రభావం వల్ల ధ్వంసమై, చెల్లాచెదురుగా పడి ఉన్న విగ్రహాలను చూసిన బొడ్డు చింతలపల్లి గ్రామస్థులు ఆలయం యొక్క చరిత్రను గ్రామంలోని వృద్ధులను అడిగి తెలసుకున్నారు. గ్రామస్థులంతా రాజకీయాలను అతీతంగా ఏకమై ఆలయం నిర్మాణానికి 2020లో శ్రీకారం చుట్టారు. గ్రామస్థులు అందరూ ఏకమై తలా ఇంతా విరాళాల రూపంలో సుమారు ఇప్పటివరకు రూ.అర కోటి వరకు సేకరించార. ఆలయ నిర్మాణం ప్రారంభించిన నాటి నుంచి ప్రారంభోత్సవ తంతు పూర్తయ్యేవరకు దాదాపు రూ.కోటిన్నర వరకు ఖర్చు అయినట్లు ఆలయ నిర్మాణ కర్తలు అయిన గ్రామస్థులు తెలిపారు. ఇందులో గ్రామస్థులు రూ.50 లక్షల వరకు సేకరించగా.. మిగిలిన రూ.కోటి దాతల సహకారంతో పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.

**ఆలయాల గురించి...**

స్వయంభులింగంగా అవతరించిన ఈ ఆలయం కాకతీయుల భక్తికి తార్కాణంగా నిలిచింది. హిందూ ధర్మాన్ని పరిరక్షించిన కాకతీయుల శ్రద్ధకు నిదర్శనంగా చెన్నకేశవస్వామి ఆలయం ఉంది. శతాబ్దాల చరిత్ర కలిగిన ఆంజనేయ స్వామి, త్రిశక్తి పీఠం అమ్మవారి ఆలయం గత చరిత్రను మనకు తెలిపే విధంగా ఉంది. ఈ ఆలయాలు శిథిలావస్థకు చేరడంతో ఇప్పు డు గ్రామస్థుల ఐక్యత, ఆర్థిక సహకారంతో పునర్నిర్మిత మైనది. కాకతీయుల శిల్పకళా అభిరుచికి ఏ మాత్రం తీసిపోకుండా ఆలయాలు పూర్వ వైభవం ఉండేలా ప్రతిష్ఠాచార్యులు, వేద పండితుల ఆధ్వర్యంలో పునః ప్రతిష్ఠ జరుగుందని గ్రామస్థులు తెలిపారు.

**గ్రామస్తులు నిర్మించిన ఆలయాలు ఇవి..**

పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, సీత సమేత రామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి ఆలయం, భద్రకాళి సమేత వీరభద్రస్వామి, గణపతి, సుబ్రహ్మ ణ్యేశ్వరస్వామి, నవగ్రహాలు, చెన్నకేశవస్వామి ఆలయాలను నిర్మించారు.

**నిత్య పూజలకు ఏర్పాట్లు..**

ప్రారంభించబోతున్న ఆలయాల్లో నిత్యపూజలు నిర్వహించడానికి కూడా ఇప్పటినుంచే సన్నాహాలు మొదలు పెట్టినట్లు గ్రామస్థులు తెలిపారు. కుటుంబాల వారిగా చందాలు వేసుకుని దూప, దీప, నైవేద్యాలు నిత్యం జరిగేలా ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిపారు.

## స్థల పురాణం..



కాకతీయుల కాలంలో తూర్పు దిశగా ఉన్న మట్టి కోట వెలుపల ఉన్న మొట్టమొదటి శైవ, వైష్ణవ క్షేత్రం బొడ్డు చింతలపల్లి శివరామ క్షేత్రమే. కాకతీయులు శైవ మతాన్ని ఎక్కువగా నమ్మువారు. మొగిలిచర్ల గ్రామంలోని ఆలయం తర్వాత అత్యంత భక్తి శ్రద్ధలతో పూజాధికైంకర్యాలు ఇక్కడే జరిగేవి. అలాగే కాకతీయ సైన్యం యుద్ధానికి వెళ్లే ముందు ఈ ప్రాంతంలో త్రిశక్తి పీఠం, భద్రకాళి సమేత వీరభద్రస్వా మి వారికి ప్రత్యేక పూజలు చేసేవారట. అంతేకాకుం డా రాయల కాలంలో గీసుగొండ లక్ష్మినరసింహస్వా మి దేవాల యం నుండి ఇక్కడి వరకు అన్ని రకాల వజ్ర, వైడు ర్యాలు, బంగారంతోపాటు నిత్యావసర వస్తువులు అమ్మే సంతా జరిగేదట. కాలక్రమేణా కాకతీయుల సామ్రాజ్యం నశించడం, నిజాం నవాబుల కాలం రావడంతో ఇక్కడి దేవాలయం యుద్ధాల కారణంగా ధ్వంసం చేయడం జరిగిందని ఇక్కడి వృద్ధులు చెబుతుంటారు.

## ఉత్సవాలు ఇలా..

- **మొదటి రోజు :** శుక్రవారం 06న మంగళవాయిద్యాలు, వేదపారాయణం, గణపతి పూజ, జలాధివాసం, ధ్వజారోహనం తదితర కార్యక్రమాలు ఉంటాయి.
- **రెండో రోజు :** శనివారం 07న వాస్తు హెూ మం, రుద్ర హెూమం, శ్రీరామ హెూమం, క్షీరా ధివాసము, బలిహరణతో కూడిన గ్రామ ప్రదక్షిణ, ధాన్యాధివాసం, వస్త్రాధివాసం కార్యక్రమాలు.
- **మూడో రోజు:** ఆదివారం 08న గవ్యాంత పూజలు, యంత్ర స్థాపన, ధ్వజస్తంభ ప్రతిష్టాపన, ప్రాణప్రతిష్ట, మహాపూర్ణాహుతి, మహాకుంభాషేకం తదితర కార్యక్రమాలతో ఆలయాలు ప్రారంభించడం జరుగుతుంది దేవాలయ కమిటి నిర్వాహకులు తెలిపారు.



వేద న్యూస్





## పెద్దమ్మ తల్లి దేవాలయ విగ్రహాలకు రూ.1 లక్ష సహాయం

**వేద న్యూస్, శాయంపేట:**


శాయంపేట మండలంలోని సాధనపల్లి గ్రామంలో ముదిరాజులు తమ ఆరాధ్యదైవం పెద్దమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి పూను కున్నారు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మిట్టపల్లి సతీష్ యువతకు ఎంతో ఆదర్శంగా నిలిచి, దేవాలయంలో ప్రతిష్టించే పెద్దమ్మతల్లి, పోతరాజుల విగ్రహాల కోసం రూ. 1 లక్ష అందజేశారు. ఈ మేరకు మంగళవారం రాత్రి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, ప్రధాన కార్య దర్శి చిందం రవి, గ్రామస్తుల ఆధ్వర్యంలో సతీష్ విగ్రహాలను కొనుగోలు చేసి, గ్రామంలో ఊరేగింపు చేశారు. ఈనెల 6న విగ్రహాల ప్రాణప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నారు. తన వయసుకు మించి గ్రామంకోసం పాటు పడుతున్న సతీష్‌ను బుచ్చిరెడ్డి, చిందం రవి, గ్రామస్తులు హృదయపూర్వకంగా అభినందించి, పెద్దమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.



## బీజేపీ మండల కమిటీ ఎన్నిక

**వేద న్యూస్, శాయంపేట :**

తెలంగాణ బిజెపి సంస్థాగత ఎన్నికల కోలహలం షురూ అయింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి విజయం సాధించే విధంగా గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు బుధవారం శాయం పేట మండల కేంద్రంలో బిజెపి మండల కమిటీని మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ప్రకటించడం జరిగింది. ఈ కమిటీలో మండల ఉపాధ్యక్షులుగా పోల్ మహేందర్, రేణుకుంట్ల చిరంజీవి, కోమటి రాజశేఖర్, లావుడియా జ్యోతి, మండల ప్రధాన కార్యదర్శులుగా మామిడి విజయ్, భూతం తిరుపతి, కార్యదర్శులుగా మేకల సుమన్, కొంగర భారతి, వంగరి శివశంకర్, జున్నుతుల జీవన్ రెడ్డి, కోశా ధికారిగా కుక్కల మహేష్ పేర్లను ప్రకటించారు. ఈ సందర్భంగా మం డల అధ్యక్షుడు నరహరి శెట్టి రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నుకోబడిన ఈ కమిటీ సభ్యులు భారతీయ జనతా పార్టీ యొక్క భావజాలాన్ని మండలంలో విస్తరింప చేస్తారని రేపు రానున్న రోజుల్లో భారతీయ జనతా పార్టీ గెలుపు కొరకు కృషి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ కానుగుల నాగరాజు, ఓబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పు రాజు పాల్గొన్నారు.



## భూ నిర్వాసితులకు చెక్కుల పంపిణీ

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలో భూమిని కోల్పోయిన రైతులకు చెక్కుల పంపిణీ చేయడం జరిగింది. మిర్యాలగూడ సబ్-కలెక్టర్,నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి లతోపాటు ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లు తిరుమలగిరి సాగర్ మండలం నెల్లికల్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ స్కూల్ నందు బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కు సంబంధించి పట్టాదారులకు భూమి నష్టపరిహార చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ ఈ.ఈ కరుణాకర్, తహశీల్దార్ ఎస్.అనిల్ కుమార్ లతోపాటు రెవిన్యూ, ఇరిగేషన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో నేరాలు అరికట్టవచ్చు

**వేద న్యూస్, శాయంపేట:**




గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వలన నేరాలను అరికట్టే అవకాశం ఉందని శాయం పేట సిఐ పి రంజిత్ రావు అన్నారు. మండల పరిధి లోని పత్తిపాక గ్రామంలో బుధవారం ఎస్సై జక్కుల పరమేష్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఏర్పాటు పై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు .ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అని సీసీ కెమెరాల వల్ల భద్రత ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలా నివారణకు, రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారులు, బస్టాండ్ చౌరస్తాలో ఏర్పాటు చేస్తే నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు పత్తిపాక గ్రామస్తులు అవగాహన సదస్సును అర్థం చేసుకొని వారి గ్రామ భద్రత గురించి పత్తిపాక గ్రామంలో ఎనిమిది సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. 40 వేలు ఇచ్చి సీసీ కెమెరా ఏర్పాటుకు సహకరించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన పత్తిపాక గ్రామస్తులకు సీఐ పి రంజిత్ రావు, ఎస్సై జక్కుల పరమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# సమస్త జీవరాసుల మనుగడను పెంచండి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



ప్రపంచం కోటానుకోట్ల జీవ రాశుల నిలయం అని,భూమి చుట్టూ ఆవరించి వున్న గాలి,నీరు, వెలుతురు వంటి అంశాలను పర్యావరణం అంటారు. పర్యావ రణము కాపాడుకోకపోతే జీవరా శుల బతుకే ప్రశ్నార్థకం అవు తుందని, మనిషి మనుగడకు ఆహారపు అలవాట్లు ప్రధాన కారణమని, ఆహారపు అలవాట్లు మార్చుకుంటే ఆయుః ప్రమాణాన్ని పెంచుకొనే అవకాశం ఉందని జన విజ్ఞాన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోలా శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములపల్లి మండలం రావుల పెంట గ్రామం లో ఉపాధి హామీ పనులు చేసే వారి వద్దకు వెళ్లి ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని,చేతి సంచులను వాడుతూ,మరలా పునరుత్పత్తికి ఉపయోగ పడే, తక్కువ మోతాదులోప్లాస్టిక్ వాడుతూ పర్యావరణ ను కలుషితం కాకుండా చూడాలని కోరారు.గత నెలరోజులు గా త్రిపురారం, వేములపల్లి, ధామరచర్ల లో 32 గ్రామాలలో పాదురి రమణారెడ్డి ఆధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక ఆరోగ్య, పర్యావరణ అవగాహనా శిబిరాలు నిర్వహిస్తున్నదని తెలిపారు.ఆరోగ్య విషయాలు చెబుతూ,ఉపాధి హామీ పనుల నాణ్యత పెంచాలని, వేసవి దృష్టిలో ఉంచుకొని వీలయినంత వరకు ఉదయం తొందరగా వెళ్లి పనులు చేసుకొని ఎండ సమయానికి ముగించుకోవాలని సూచించారు.జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు గుత్తికొండ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ వంట నూనెల వాడకం ప్రతీ నెల బాగా పెరుగుతుందని,మార్కెట్‌లో దొరికే నూనెలకన్నా,వేరు శనగలు,నువ్వులు, కుసుమలు, కొబ్బరి వంటి వాటిని గానుగలలో ఆడించి తీసిన నూనెలు వాడాలని, వంటకు అల్యూమినియం పాత్రలు వాడినట్లయితే అవి కరిగి మనం తినే ఆహారం లోకి వెళ్లి ఆరోగ్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉన్నందున స్టీలు,ఇనుప పాత్రలు వంటకు ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు.సీనియర్ జే వి వి నాయకులు,పాదురి రమణా రెడ్డి మాట్లాడుతూ కృత్రిమ శీతల పానీయలు అయిన కూల్ డ్రింక్స్ ఎక్కువ కాలం నిల్వ ఉండటానికి, తియ్య ధనం కోసం దానిలో రసాయన పాదర్ధాలు వాడుతున్నారని వాటిని తాగడం వలన అల్సర్ లు,కాలేయ సంబందిత రోగాలు వచ్చే అవకాశం ఉందని వాటిని త్రాగడం మానివేసి సహజ పానియాలు అయిన పళ్ళ రసాలు,మజ్జిగ,షర్బత్ వంటి వాటిని సేవించాలని, విద్యార్థులను నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, ప్రభుత్వ ఆస్పత్రులలో రక్త పరీక్షలు చేయించుకొని తమ ఆధాయాన్ని ఆధా చేసుకోవాలని కోరారు. మరో సీనియర్ జేవివి నాయకులు పారెపల్లి సత్యనారాయణ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంచే గుర్తించ బడిన జెనరిక్ మందులను వాడాలని,వాణిజ్య ప్రకటనలు చూసి మోసపోవద్దని, వేసవి కాలం దృష్ట్యా సాధ్యమైనంత వరకు ఎండ రాకముందే ఆరుబయట పనులు ముగించుకొని,వీలయినంత వరకు ఎక్కువ నీటిని తీసుకొని వడ దెబ్బ ప్రమాదానికి గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వల్లపుదాసు సతీష్,మహేష్, ఉపాధి హామీ పథకం సేవకులు పాల్గొన్నారు.

# ఈ లక్షణాలుంటే మీ కిడ్నీలకు ప్రమాదం

■ **డాక్టర్ ఊడుగుల సురేశ్**



**వేద న్యూస్, జమ్మికుంట:**

ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అత్యంత శ్రద్ధ వహించాలని వైద్య నిపుణులు నిత్యం చెబుతుంటారు. అయితే, కొందరు హెల్త్ పట్ల నిర్లక్ష్యం వహిస్తుంటారు. ఏదైనా అనారోగ్యం బారిన పడినా.. ఏవైనా లక్షణాలు కనిపించినా పట్టించు కోరు. అది చాలా ప్రమాదకరమని వైద్యులు హెచ్చరిస్తున్నా రు. ముఖ్యంగా కిడ్నీ వ్యాధుల విషయంలో నిర్లక్ష్యం చేయకూడదని జమ్మికుంట సంజీవని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుడు, ఎండీ జనరల్ మెడిసిన్, కన్సల్టెంట్ ఫిజీషియన్, ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్, పెయిన్ స్పెషలిస్ట్, దయాబెటాలజిస్ట్ డాక్టర్ ఊడుగుల సురేశ్ వెల్లడించారు. కిడ్నీ వ్యాధుల లక్షణాలపై ఆయన 'వేద న్యూస్'తో మాట్లాడారు. అవేంటో మీరూ తెలుసుకోండి. రకరకాల కిడ్నీ వ్యాధులకు లక్షణాలు వేరు వేరుగా ఉంటాయి. వాటిలో ముఖ్య లక్షణాలు ఈ విధంగా ఉంటాయి.

- ఉదయం నిద్ర లేచిన వెంటనే ముఖం, కళ్లు వాచి ఉండటం.
- ఆకలి తక్కువగా ఉండటం, వాంతులు చేసుకోవడం, వికారంగా అనిపించడం.
- తరచూ మూత్ర విసర్జన అవసరమవడం.. (ప్రత్యేకంగా రాత్రివేళల్లో)
- చిన్న వయస్సులోనే రక్తపోటు వ్యాధి ఉండటం. నీరసంగా, రక్తం నిస్సారంగా అవడం.
- కొంచెం నడిచే సరికి ఆయాసము రావడం, నీరసంగా అనిపించడం.
- 6 ఏండ్ల వయస్సు తర్వాత కూడా మంచం మీదనే మూత్రం పోయడం, మూత్రం తక్కువగా రావడం
- మూత్ర విసర్జన సమయంలో మంట పుట్టడము, మూత్రంలో రక్తం కానీ చీము కానీ రావడం
- మూత్ర విసర్జన కష్టమై.. బొట్టు బొట్టుగా రావడం..
- కడుపులో పుండు అవడం, కాళ్లలో, నడుము నొప్పి కలగడం.
- పైన వివరించిన లక్షణాలలో ఏ ఒక్క లక్షణము ఉన్నా కూడా కిడ్నీ రోగము ఉండటానికి అవకాశం ఉంటుంది. పైన పేర్కొన్న వాటిల్లో ఏది ఉన్నా వెంటనే డాక్టర్‌ను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి.

## 'ఖర్గే'వి పీడ కలలు

మొదటి పేజీ తరువాయి

4 నుంచి 25 వరకు చేపట్టబోయే కార్యక్రమాలు, కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో గత 60 ఏళ్లుగా జరగని ఎన్నో అభివృద్ధి పనులు ఈ 11 ఏళ్లలో చేసి చూపిన ఘన ప్రధాని మోదీదే అని అన్నారు. సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని ఒక 370 ఆర్టికల్ రద్దు, త్రిబుల్ తలాఖ్ రద్దు, వక్ఫ్సవరణ చట్టం, అయోధ్య రామ మందిర నిర్మాణం, ఇలా చెప్పుకుంటూ పోతే లెక్కలేనన్ని సాహసోపేత నిర్ణయాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఈ 11 ఏళ్ల మోదీ పాలనలో భారత్ ప్రపంచదేశాలలో అగ్రగామిగా పురోభివృద్ధి సాధిస్తోంది అని అది చూసి ఓర్వలేక కాంగ్రెస్ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఈ దేశంలో ప్రధాని మోదీని మించిన బలమైన నాయకత్వం లేనే లేదన్నారు. కులగనన విషయంలో కాంగ్రెస్ మా క్రెడిట్అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ దేశానికి బలమైన నాయకుడు మోదీ తప్ప మరెవ్వరు లేరన్నారు పెహల్గం దాడిని ప్రపంచమే మెచ్చుకుంటుంటే.. కాంగ్రెస్ విమర్శించడం సిగ్గుచేటన్నారు. ట్రంప్ చెప్తే యుద్ధం ఆపేసారంట అనడం సరికాదు అని పాకిస్తాన్ పై మన యుద్ధం చేయనేలేదు, కేవలం ఉగ్రవాద స్థావారాలపై దాడి చేసామంతే, 370 ఆర్టికల్ రద్దు తర్వాత కాశ్మీర్లో అలాంటి పరిస్థితులు లేవు, కాశ్మీర్లో పర్యాటక అభివృద్ధి రెట్టింపు అయ్యింది, భారత్ దేశ అభివృద్ధిని చూసి ఓర్వలేక కొన్ని దేశాలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. దేశంలో 11 ఏళ్ల మోదీ పాలనపై కేంద్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాస్థాయిలో విస్తృత ప్రచారం జూన్ 6న అన్ని మండలాల్లో ఒకేస్థాయి కార్యశాలు ఉంటాయని జూన్ 9న జిల్లా స్థాయిలో ప్రెస్ మీట్ 10, 11 తేదీలో నియోజకవర్గాలలో ప్రెస్ కాన్ఫరెన్స్, ఆ తర్వాత రోజు జిల్లా స్థాయిలో ప్రొఫెషన్ మీట్స్, మేధావుల సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రతి మండలంలో వికసిత్ భారత్ సంకల్ప్ సభ నిర్వహించాలన్నారు. గ్రామ, నగరం, పంచాయతి పరిధిలలో రచ్చబండలు నిర్వహించాలన్నారు. జిల్లా, మండల కేంద్రాలు, నియోజకవర్గ స్థాయిలో మోదీ 11 ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధి పనులపై ఎగ్జిబిషన్లు నిర్వహించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ యోజనలో వయో వృద్ధుల వివరాలు నమోదు చేయించాలని, జిల్లా, నియోజకవర్గ స్థాయిలలో డిజిటల్ కాంపిటేషన్స్ నిర్వహించాలనీ బిజేపీ నాయకులకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. సరల్ యాప్లో ఈ ప్రోగ్రామ్స్ అన్నింటిని అప్ లోడ్ చేయాలి, చేయించాలన్నారు. రాష్ట్ర సాధన కోసం 1200 మందికి పైగా యువత, విద్యార్థులు ప్రాణ త్యాగాలు చేశారు. గల్లి నుండి ఢిల్లీ పార్లమెంట్ వరకు ఆందోళనలు కొనసాగాయి. కేసిఆర్ హామీ ఇచ్చిన బంగారు తెలంగాణ సాధించలేదు. కాని వారు కుటుంబం మాత్రం బంగారమైందని ఏద్దేవా చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ గారి నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వం నీతి నిజాయితీతో దేశాన్ని అభివృద్ధి చేస్తుంది. రాష్ట్రాన్ని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడని ఖర్గే భయంకరమైన కలలు కంటున్నాడు అని ఎద్దేవా చేశారు. దేశంలో యువత ఉద్యోగాలు చేసే వారుగా కాకుండా.. ఉద్యోగాలు ఇచ్చే వారీగా తయారు చేస్తున్నారు మోడీ అని పేర్కొన్నారు. ఓబీసీ రిజర్వేషన్లను అడ్డుకుంది రాహుల్ గాంధీ కుటుంబం.. ప్రపంచ వ్యాప్తంగా దేశ ప్రతిష్ట పెరుగుతుంటే.. మోడీనీ నాయకునిగా కీర్తిస్తుంటే గర్వకారణం కాదా అనేది ఖర్గే చెప్పాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ సింధూర్ లాంటి దాడులతో పాకిస్తాన్ కు కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడైనా చేశారా అని ప్రశ్నించారు. ఇక కాంగ్రెస్ ను నమ్మే పరిస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. ఈ కార్యక్రమంలో మాజి శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, కార్యక్రమం కో-కన్వీనర్లు వడ్డేపల్లి నరసింహులు, ముంద్రాతి వెంకటేశ్వర్లు మరియు జిల్లా పదాధికారులు, జిల్లా వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు, కార్యక్రమ మండల కన్వీనర్, కో కన్వీనర్లు పాల్గొన్నారు.

## వ్యవసాయం చేస్తున్న వారిలో 36శాతం కౌలు రైతులే..

**వేద న్యూస్, ఇల్లందకుంట:**



కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల పరిధిలోని సిరిసేడు గ్రామంలో రైతు స్వరాజ్య వేదిక సంస్థ ఆధ్వర్యంలో కౌలు రైతుల గురించి బుధవారం సర్వే చేశారు. రాష్ట్రంలో వ్యవసాయం చేస్తున్న వారిలో 36 శాతం కౌలు రైతులే ఉన్నారని, వీరికి సరియైన గుర్తుంపు లేక ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారం అందక, అప్పుల బాదతో కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని రైతు స్వరాజ్య వేదిక వారు తెలిపారు.

ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం ఇవ్వడం లేదని వెల్లడించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం 2011 లో కౌలు రైతుల అధీకృత సాగుదారుల చట్టం తెచ్చి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ చట్టం అమలు చేయకపోవడం వలన కౌలు రైతు గుర్తింపునకు నోచుకోవడం లేదని వెల్లడించారు. పంటను అమ్మడంలో వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారని వివరించారు. ఈ ప్రభుత్వం సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నదని, మరి కౌలు రైతులకు ఎలా అందిస్తున్నారు? వారికి బోనస్ వస్తుందా లేదా ? అనే విషయమై సర్వేలో అడగగా, భూమికి కౌలు ధరలు ఈ బోనస్ వచ్చిన నాటి నుంచి పెరిగాయనే విషయం తెలిసిందని వివరించారు. కార్యక్రమం లో రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కో ఆర్డినేటర్ కొండల్‌రెడ్డి, సామాజిక కార్యకర్త వంగ రామకృష్ణ, రైతు స్వరాజ్య వేదిక సభ్యులు రాచపల్లి సమ్మయ్య, ఇంజం చైతన్య, సాకర్మాన్ వెంకటేశ్, ముక్క శశికుమార్, కొమ్మరాజుల అనూష , కొలుగురి స్వర్ణలత, కాయిత అన్నపూర్ణ, హైదరాబాద్ సెంట్రల్ విద్యార్థిని శ్రీ హిత, గ్రామస్తులు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## సమాజానికి దిక్సూచి జర్నలిజమే..!

మొదటి పేజీ తరువాయి

దామెర రాజేందర్ కో-ఆర్డినేటర్లుగా నిర్వహించిన జర్నలిస్టుల శిక్షణా శిబిరం బుధవారం కాశీబుగ్గ స్కాలర్స్ పబ్లిక్ స్కూల్ జరిగింది. ఈ సందర్భంగా తిరునహరి శేషు హాజరై ప్రారంభోపన్యాసం చేశారు. పాలకులకు, ప్రజలకు వారధిగా పత్రికలు ఉండే క్రమంలో జర్నలిస్టులు బాధ్యతతో ముందుకు సాగాలని అన్నారు. సమాజంలో మరుగనపడ్డ సమస్యలను, వివిధ అంశాలను వెలికితీయడంలో జర్నలిస్టు తమదైన శైలిలో ముందుకు సాగడం అభినందనీయమన్నారు. సోషల్ మీడియా ప్రభావం పేరుగుతున్న నేపథ్యంలో నేటితరం జర్నలిస్టులు మరింత అప్రమత్తంగా ఉండటంతోపాటు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి శిక్షణా శిబిరాలు భవిష్యత్తులో కొనసాగించాలని అన్నారు. నిర్వాహకులను అభినందించారు.

### వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి: కేయూ జర్నలిజం విభాగం అధ్యాపకులు కంజర్ల నర్సింహరాములు

మారుతున్న కాలానికనుగుణంగా జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని కేయూ జర్నలిజం విభాగం అధ్యాపకులు కంజర్ల నర్సింహరాములు అన్నారు. వార్తలు, స్టోరీలు, వార్తాసేకరణ, శీర్షికలు, లీడ్, సూపర్ లీడ్, వాక్యనిర్మాణం తదితర అంశాలపై ఈ క్లాసులో చర్చించారు. జర్నలిజం పరిణామా క్రమాన్ని వివరించారు. పత్రికా రంగంలో నాటికి నేటికి వచ్చిన మార్పులను, ఆ మార్పులకనుగుణంగా నేటితరం జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరాన్ని బోధించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, వివిధ మండలాలు, ప్రాంతాల వర్కింగ్ జర్నలిస్టులు, స్కాలర్స్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ వెంకటరత్నం, పి. సురేందర్, కిరణ్, స్వామిదాస్, ఆర్. శ్రీనివాస్, శంకర్, కె. వెంకన్న ,రాజేందర్, రవి కుమార్, సాయి, సందీప్, వెంకటేశ్వర్లు, గణేష్, మధు, నరేష్, యాకూబ్, కె. రాజేందర్, పి. శ్రీనివాస్, సుమన్, రాణా ప్రతాప్, తరుణ్ తేజ్, మోహన్, కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

మొదటి పేజీ తరువాయి

కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ ల వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలన జరిపి, సమర్థ నిర్వహణకు అధికారులకు పలు సూచనలు చేశారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మా లో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో తహశీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073